# జేఎన్టీయూ విద్యార్థులకు 'జపాన్' అవకాశాలు




**ఎల్‌ఎస్-పార్టనర్స్ సంస్థతో అవగాహన ఒప్పందం**
**సెమీకండక్టర్స్, 3డీ డిజైన్ రంగాల్లో ప్లేస్మెంట్స్**
**ఇంజనీరింగ్ విద్యార్థులకు నూతన దారులు**

కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్ : అమెరికా, బ్రిటన్, కెనడా వంటి దేశాలకు ప్రత్యామ్నాయంగా జపాన్లో ఉమ్మడి పరిశోధనలు, సాంకేతిక కెరీర్, ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకునేందుకు జేఎన్టీయూ హైదరాబాద్ విద్యార్థులకు మార్గం సుగమమైంది. ఇందులో భాగంగా జేఎన్టీయూహెచ్, టోక్యోకు చెందిన ఎల్ఎస్-పార్ట్నర్స్, నగరానికి చెందిన కెరీర్ కన్సల్ట్ సంస్థల మధ్య కీలకమైన లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్వోఐ) కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు జపాన్లోని సెమీకండక్టర్స్, 3డీ డిజైన్, ఇంజనీరింగ్ రంగాల్లో నేరుగా ప్లేస్మెంట్ అవకాశాలు లభించనున్నాయని వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ రాష్ట్రం, జపాన్లోని కిటాక్యూషు నగరాల మధ్య ఉన్న స్నేహపూర్వక ఒప్పందానికి అనుగుణంగా ఈ చొరవ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జపాన్లో వృద్ధుల జనాభా పెరుగుతుండటంతో అక్కడ నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక దిగ్గజంగా ఉన్న జపాన్.. భారతీయ విద్యార్థులకు, ముఖ్యంగా ఆటోమోటివ్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో విస్తృత అవకాశాలు కల్పిస్తోంది. ఈ ఒప్పందం విద్యార్థుల భవిష్యత్తుకు తొలి అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ వైస్-ఛాన్సలర్ టీ. కిషన్ కుమార్ రెడ్డి, రెక్టర్ కె. విజయ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు, అకడమిక్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ ఎం. ధనలక్ష్మి, ఎల్ఎస్-పార్ట్నర్స్ ప్రెసిడెంట్ సయూరి మట్సునో, కెరీర్ కన్సల్ట్ సీఈఓ రోహిత్ రావు మెనేని తదితరులు పాల్గొని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

# జపనీస్ సంస్థతో జేఎన్‌టీయూ ఒప్పందం

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): జపనీస్ సంస్థ ఎల్ఎస్ పార్ట్‌నర్స్ నగరానికి చెందిన కెరీర్ కన్సల్ట్‌తో జేఎన్‌టీయూలో పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్నది. ఈ ఒప్పందంతో ఎల్క్ట్రానిక్స్, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ రంగంలో జపాన్‌లో ప్లేస్‌మెంట్ పొందేందుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ)పై ఇరు విద్యా సంస్థలు మంగళవారం ఎంవోయు చేసుకున్నాయి. ప్రస్తుతం జపాన్‌లో వృద్ధాప్య సమస్య ఉన్నదని, దీంతో నైపుణ్యం కలిగిన కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కే కిషన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ఎం ధనలక్ష్మి, జపనీస్ సంస్థ ప్రతినిధులు సయురి మట్సునో పాల్గొన్నారు.

# జపనీస్ సంస్థతో జేఎన్‌టీయూ ఒప్పందం



పత్రాలు చూపుతున్న వీసీ డా.టీకేకే రెడ్డి, సంస్థ సీఈఓ సయూరి మాట్సునో

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ, టోక్యోకి చెందిన జపనీస్ సంస్థ ఎల్ ఎస్ పార్ట్‌నర్స్‌తో ఒప్పందంలో భాగంగా ప్రాథమికంగా లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా వర్సిటీ వీసీ డాక్టర్ టీకేకే రెడ్డి, జపనీస్ సంస్థ సీఈఓ సయూరి మాట్సునో సంతకాలు చేసి ఒకరికొకరు పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు జపాన్‌లో ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, సాంకేతిక కెరీర్లు, ఉన్నత విద్య అవకాశాలను పెంపొందించనున్నారు. రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరావు, అకడమిక్ అండ్ ప్లానింగ్ సమన్వయకర్త డాక్టర్ ఎం.ధనలక్ష్మి, కెరీర్ కన్సల్టెంట్ వ్యవస్థాపకుడు రోహిత్‌రావు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి మొదటివారంలో ఏప్‌సెట్ నోటిఫికేషన్

**సన్నాహాలు చేస్తున్న సెట్ కన్వీనర్**

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏప్ సెట్) నోటిఫికేషన్ ఫిబ్రవరి మొదటివారంలో ఇవ్వనున్నారు. దీనికోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్‌సెట్ మే నెలలో జరుగుతుంది. దరఖాస్తుల స్వీకరణ, ఫీజుల వివరాలు, సిలబస్‌తో కూడిన నోటిఫికేషన్‌ను సెట్ కన్వీనర్ విడుదల చేయాల్సి ఉంది. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారు. ఈ కారణంగా ఈ ఏడాది ఇంటర్ చదివే విద్యార్థుల పూర్తి ఆన్‌లైన్ డేటా అందాల్సి ఉందని సెట్ వర్గాలు తెలిపాయి. ఏప్‌సెట్‌కు దరఖాస్తు చేసే క్రమంలో ఆధార్, లేదా ఇంటర్ హాల్ టికెట్ నంబరును ఎంటర్ చేయగానే విద్యార్థి డేటా మొత్తం ఆన్‌లైన్‌లోకి వస్తుంది. ఇది జరగాలంటే ముందుగా ఇంటర్ బోర్డు హాల్ టికెట్లు విడుదల చేయాలి. ప్రీ హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు ఇప్పటికే విడుదల చేసింది. అయితే, ఈ డేటాను ఆన్‌లైన్ చేయలేదు. పూర్తి ఆన్‌లైన్‌తో కూడిన హాల్ టికెట్లను మరో 15 రోజుల్లో విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తవ్వగానే ఏప్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఈసారి పరీక్ష కేంద్రాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. బాలికలకు సమీపంలోనే పరీక్ష కేంద్రం ఉండేలా చూస్తామని అధికారులు తెలిపారు.

**ఇంటర్ హాల్ టికెట్లు వచ్చాకే...**



సెట్ నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశాం. త్వరలోనే సెట్ కమిటీ సమావేశమవుతుంది. ఇంటర్ హాల్‌టికెట్లను విడుదల చేయాలని ఇంటర్ బోర్డును కోరాం. విద్యార్థి సమగ్ర సమాచారం బోర్డు నుంచే తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో ఆధార్ లేదా ఫోన్ నంబర్‌తో ఏప్‌సెట్‌కు లాగిన్ అయితే, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా సమాచారం వస్తుంది. హాల్ టికెట్లు విడుదలైన తర్వాత ఏప్‌సెట్ నోటిఫికేషన్ ఇస్తాం. ఫిబ్రవరి మొదటి వారంలో నోటిఫికేషన్ ఇవ్వాలనుకుంటున్నాం.

– ప్రొఫెసర్ కె విజయకుమార్‌రెడ్డి, ఏప్‌సెట్ కన్వీనర్

**15 రోజుల్లో ఇంటర్ హాల్ టికెట్లు**



ఇంటర్ థియరీ పరీక్షల హాల్‌టికెట్లు మరో 15 రోజుల్లో విడుదల చేస్తాం. ఇప్పటికే నమూనా హాల్ టికెట్లు ఇచ్చాం. ప్రాక్టికల్స్‌కు సంబంధించినవి విద్యార్థులకు వెళ్లాయి. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఒకటికి రెండుసార్లు పరిశీలించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఆన్‌లైన్‌లోనూ హాల్‌టికెట్లు అందుబాటులోకి తేవడానికి అవసరమైన సాఫ్ట్‌వేర్ కూడా సిద్ధం చేశాం.

– జయప్రదాబాయి, ఇంటర్ పరీక్షల విభాగం అధికారి